సాక్షి
ప్రకాశం
మంగళవారం | 10 | జనవరి | 2023



స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. - 8లో..



కూలిన బతుకులు

జిల్లాలో సోమవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు కూలీలు మృతి చెందగా ఐదుగురికి గాయాలయ్యాయి.
- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
28 /18

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

ఆసరా, చేయూతలతో జీవనోపాధి పెంచుకోవాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆసరా, చేయూత పథకాల ద్వారా అందించే ఆర్థిక ప్రయోజనాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని మెరుగైన జీవనోపాధి పెంచుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. ఆసక్తి ఉన్నవాళ్లు జగనన్న పాల వెల్లువ పథకం కింద పాడి పశువులను ఈ పథకాల ద్వారా అందిన డబ్బుతో కొనుగోలు చేసేలా చైతన్య పరచాలని అధికారులకు సూచించారు. ఈ అంశంపై డీఆర్‌డీఏ, మెప్మా, పశుసంవర్ధక శాఖ, బ్యాంకు అధికారులతో సోమవారం స్పందన భవనంలో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పశుసంవర్ధక, మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో ఆసరా, చేయూత పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రతి మహిళను సంప్రదించాలన్నారు. జీవనోపాధి కోసం పాడి పశువులు కావాలని ముందుకు వచ్చిన వారికి లక్ష్యం మేరకు సరఫరా చేయాలని ఆదేశించారు. జిల్లాకు పాడిపశువులను సరఫరా చేసేందుకు ఆసక్తి చూపుతున్న వారి అనుభవం, సామర్థ్యం, పశువుల నాణ్యత తదితర విషయాలను తెలుసుకునేందుకు టెండర్ల స్వీకరణ ప్రక్రియ తక్షణమే చేపట్టాలన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు బ్యాంకర్లు ముందుకు వచ్చి లబ్ధిదారులకు అండగా నిలవాలన్నారు. దీనిలో డీఆర్‌డీఏ పీడీ బాబురావు, మెప్మా పీడీ రవికుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, ఎల్‌డీఎం యుగంధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సొంతూరులో ఉపాధి కరువు.. ప్రతి పూటా బతుకు పోరాటం.. జీవనయానం కోసం వేల కి.మీ. పయనం. రోడ్డు పక్కన గుడారాలు వేసుకుని ఆ చెంతనే నిప్పుల కొలుములు పెట్టుకుని వ్యవసాయ పరికరాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయ సీజన్‌లోనే వీరికి ఆదరువు. ఒక వైపు యాంత్రీకరణ పెరిగిపోతున్నా.. బుక్కెడు మెతుకుల కోసం వలస జీవులు ఊరూరా తిరుగుతూ తమకు తెలిసిన నైపుణ్యంతోపనిముట్లు తయారు చేసి విక్రయిస్తూ పొట్ట నింపుకుంటున్నారు. వలస జీవుల జీవన ఆరాటంపై స్పెషల్ ఫోకస్...

- పొట్ట చేత పట్టుకుని వేల కిలోమీటర్లు పయనం
- వ్యవసాయ పనిముట్లు తయారీ, విక్రయాలతో జీవనం
- ఏటా ఏడు నెలల పాటు ఇక్కడే సంచార జీవనం
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన 5 వేల మందికి పైగా జీవనోపాధి

వలస బతుకుల మెతుకు వేట..!



పనిముట్లు తయారు చేస్తున్న వలస జీవులు

దర్శి టౌన్: మధ్యప్రదేశ్..ఉత్తరప్రదేశ్..ఛత్తీస్‌ఘడ్.. ఇవన్నీ జిల్లాకు సుదూర ప్రాంతాలే. ఎన్నో వేల కిలోమీటర్లు దాటి వచ్చి ఎన్నో ఆశల మధ్య జీవనం సాగిస్తున్నారు వలస జీవులు. రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు. పనిచేస్తేకానీ నోటికందని మెతుకుని రెక్కల కష్టం చేద్దామన్నా స్థానికంగా అండ లేక, పూటగడవడమే కష్టమైన వేళ.. వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ ముందుకు సాగుతున్నారు. నిప్పుల కొలిమిలో ఇనుమును కరిగించి.. రెక్కలు ముక్కలు చేసుకుంటూ వ్యవసాయ పనిముట్లు తయారు చేసి విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆ కుటుంబాల్లో పిల్లా పెద్దా... ఆడ, మగ.. ఇలా అందరికీ ఇనుముతోనే బతుకు అంతా ముడిపడి ఉంటుంది. ఒకరో ఇద్దరో కాదు ఐదు వేల మందికి పైగా నిరుపేదలకు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి జిల్లాకు పొట్ట చేత పట్టుకుని వస్తున్నారంటే ఆశ్చర్యం కలిగించక మానదు. ఏటా వ్యవసాయ సీజన్‌లో ఒక్కడే ఉండి ఊరూరా తిరుగుతూ వ్యవసాయ పనిముట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇలా సీజన్‌లో నాలుగు డబ్బులు సంపాదించుకుని తిరిగి సొంత ఊళ్లకు వెళ్తుంటారు.

డొక్కాడాలంటే రెక్కాడాల్సిందే..

యాంత్రీకరణ గణనీయంగా పెరిగిన ఈ రోజుల్లోనూ వారు చేతి వృత్తి పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఉదయం ఆరున్నర గంటలకు మొదలై పని రాత్రి ఏడు గంటల వరకు కొనసాగుతుంది. ఆడ, మగ తేడా లేకుండా పనిముట్లు తయారు చేస్తారు. పనిముట్లు తయారు చేసుకునేందుకు అవసరమైన పరికరాలు తమ వెంట తెచ్చుకుంటారు. వీటి తయారీకి లారీల పాత కమాన్ ప్లేట్లు కేజీ రూ.80కి కొంటారు. వాటిని కొలిమిలో కాల్చి ఇనుమును కరిగించి, సమ్మెటల సాయంతో గునపాలు, కొడవళ్లు, పారలు, వంట పనిముట్లు తయారు చేస్తారు. రోడ్డు పక్కన నిప్పుల పొయ్యి రాజేసుకుని చపాతీలు, రోటీలు తయారు చేసుకుని తింటారు. రాత్రయితే రోడ్ల పక్కన గుడారాలు వేసుకుని గుడి మెట్ల పక్కనో..షాపుల ఆవరణలో నిద్రిస్తారు. సైజును బట్టి కొడవలి రూ.20 నుంచి రూ.200 వరకు విక్రయిస్తారు. గొడ్డలి రూ.150 నుంచి రూ.300, మాంసం కత్తి రూ.100 నుంచి రూ.250 వరకు విక్రయిస్తారు. రోజుకు వెయ్యి నుంచి రూ.1500 వరకు విక్రయాలు ఉంటాయి. ఊరూరా తిరుగుతూ వాటిని విక్రయిస్తూ వచ్చిన **డబ్బులతో** పిల్లలను సాకుతున్నారు. సంచార **జీవితం సాగిస్తూ** బతుకులు వెళ్లదీస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 5 వేల మందికి పైగా **పని**ముట్ల తయారీలో జీవనోపాధి **పొం**దుతున్నారు. ముఖ్యంగా జన **సం**చార ప్రాంతాల్లో కొంత **స్థలంలో** తాత్కాలికంగా కొలిమి **ఏర్పాటు** చేసుకుని పనిముట్లు **తయారు** చేస్తుంటారు. జిల్లాలో ఎక్కువగా **దర్శి** బస్టాండ్ ప్రాంతం, తాళ్లూరు వీకే **కళా**శాల వద్ద, వినుకొండలో **కురిచేడు** రోడ్‌లో గొర్రెల బడ్డి వద్ద వ్యవసాయ **పరిక**రాలు తయారు చేసుకుని విక్రయి**స్తున్నారు.** దొనకొండ నాలుగు కూడళ్ల ప్రాం**తంలో, చీమ**కుర్తిలో జవహర్ హాస్పిటల్ వద్ద, బీవీఎస్ కళాశాల ప్రాంతం, గిద్దలూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో, మోటు వద్ద, మార్కాపురంలో తర్లుపాడు మండల కేంద్రం, కొండపి బస్టాండ్ ప్రాంతంలో, కట్టంవారి పాలెం వద్ద, యర్రగొండపాలెం బస్టాండ్ ప్రాంతంలో అర్థవీడు మండలం కుంట వద్ద స్థావరాలు ఏర్పాటు చేసుకుని డిమాండ్ ఉన్న రోజుల వరకు అక్కడే ఉంచి పనిముట్లు తయారు చేసి అమ్ముకుని **జీవనం సాగిస్తారు.**

అక్కడ ఆదరణ లేదు



మధ్యప్రదేశ్‌లో పనిముట్లు తయారు చేసినా సరైన ఆదరణ లేదు. అమ్ముకోవాలంటే గిరాకీ లేదు. అందుకే వ్యవసాయ సీజన్‌లో ఏడు నెలల పాటు ఇక్కడే ఉంటూ పలు గ్రామాలు తిరుగుతూ పనిముట్లు అమ్ముకుంటాం. రోజుకు గ్రామాన్ని బట్టి రూ.1500 నుంచి రూ.2 వేలు వరకు వస్తాయి. ఖర్చులు పోను జీవనానికి ఇబ్బందులు ఉండవు. ఉపాధి కల్పిస్తున్న ఏపీకి ప్రత్యేక కృతజ్ఞతలు.
– జగదీష్, భోపాల్, మధ్యప్రదేశ్

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి తనను కలిసిన ప్రభుత్వ ఉద్యోగులకు హామీ ఇచ్చారు. సోమవారం తన కార్యాలయంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు, జిల్లా అధ్యక్షుడు టి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన వైద్యులకు ప్రశంస పత్రాలు



ఉత్తమ ప్రతిభ చూపిన వైద్యులకు ప్రశంస పత్రాలు అందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలు ప్రతి పేదవాని ఇంటికి చేరేలా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి విజయవంతంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ప్రతిభ చూపి మెరుగైన సేవలందించిన వైద్యులకు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సోమవారం స్పందన భవనంలో ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. ప్రశంస పత్రాలు అందుకున్న వైద్యులలో ఎస్ వాణి (పీహెచ్‌సీ కరవది), ఎం వైష్ణవి (కొత్తపట్నం పీహెచ్‌సీ), ఎస్ ఖాదర్‌మస్తాన్ బీ (తాళ్లూరు పిహెచ్‌సి), కె నాగార్జున గౌడ్ (పుల్లలచెరువు పీహెచ్‌సీ), ఎస్‌కే మోనా రసూల్ (అర్థవీడు పీహెచ్‌సీ) ఉన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్ కుమార్, మాధవీలత, డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- రాష్ట్రంలో 24 పైగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయి
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ రమణారెడ్డి అధ్యక్షతన స్థానిక హరిత హైవే రిసార్ట్స్‌లో సోమవారం మండల స్థాయి సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పుడున్న అధికారాన్ని కాపాడుకోవాలంటే కార్యకర్తలే మనకు ముఖ్యమని అన్నారు. కార్యకర్తలు రానున్న రోజుల్లో మరింత కష్టపడి పార్టీని ముందుండి నడిపించాలన్నారు. జగనన్న అందిస్తున్న 24 పైగా సంక్షేమ పథకాల విశిష్టతను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థలను తీసుకొచ్చిందని అన్నారు. ఈ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని అన్నారు. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన వేకువ జామునే పోటీపడి పింఛన్లు అందిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వంలో అవ్వా తాతలకు 60 ఏళ్లు దాటినా పెన్షన్ మంజూరయ్యే పరిస్థితి లేదన్నారు. నాడు స్కూళ్లలో మరుగుదొడ్లు కూడా ఉండేవి కాదన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా పార్టీ కండువాలను కప్పి పెన్షన్లు అందించారని ఆయన విమర్శించారు. కానీ నేడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతరత్రా సేవలను కులం, మతం, పార్టీలు చూడకుండా అందరికీ వారి ఇంటి వద్దే అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పరిపాలనను అందించేందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి తోడ్పాటునందించాలని కోరారు. గ్రామాల్లో నిర్మించిన గ్రామ సచివాలయాలు గ్రామీణ ప్రజల పాలిట ఆధునిక దేవాలయాలుగా మారాయన్నారు. సచివాలయ కన్వీనర్ల విధులను ఆయన వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేపట్టి నాలుగేళ్లు అయిన సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మా పద్మజ, జెడ్పీటీసీ సభ్యులు డుమావత్ లతాబాయి, సర్పంచ్ చిత్తూరి హారిక, మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఒంటేరు నాగేశ్వరరావు, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బాంధవుడు సీఎం వైఎస్ జగన్

- దేశంలో ఎవరూ చేపట్టని విధంగా ప్రజా సంకల్ప యాత్ర
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి
- ఘనంగా ప్రజా సంకల్ప యాత్ర విజయోత్సవ కార్యక్రమాలు
- పాల్గొన్న ఎంపీ మాగుంట



కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, జంకె వెంకటరెడ్డి

ఒంగోలు సబర్బన్: సంక్షేమ బాంధవుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరు తెచ్చుకున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర పూర్తి చేసుకొని నాలుగు సంవత్సరాలు అయిన సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయ ప్రాంగణంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయోత్సవ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘమైన ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి చరిత్రలో నిలిచిపోయేలా రికార్డు సృష్టించిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. దేశంలో ఏ ఒక్కరూ చేపట్టని విధంగా ఇడుపులపాయ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు మొత్తం 3,648 కిలో మీటర్లు ప్రజా సంకల్ప యాత్ర చేపట్టారని కొనియాడారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూసి చలించిపోయారన్నారు. అందుకే ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా నెరవేర్చి సంక్షేమ పథకాల సారథిగా పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ దూసుకుపోతున్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా, ఇవ్వని హామీలు కూడా ఎన్నో అమలు చేసి సంక్షేమ పరిపాలన సాగిస్తున్నారని కొనియాడారు. వచ్చే 2024 సాధారణ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర రాష్ట్రంలోని ప్రతి హృదయాన్ని తాకిందన్నారు. పార్టీని ప్రతి ఒక్క కార్యకర్త బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ సీట్లకు 175 సాధించి రాష్ట్రంలో ఇక తిరుగులేదనిపించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, రాష్ట్ర శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గంటా రామానాయుడు, రాష్ట్ర నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ధరణికోట లక్ష్మీ నారాయణ, రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి కరుణాకర్, వైఎస్సార్‌సీపీ ఒంగోలు మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి అంకయ్య, ఒంగోలు నగర పాలక సంస్థ కార్పొరేటర్లు ప్రవీణ్ కుమార్, అంగిరేకుల గురవయ్య, శ్రీరాం నాగభూషణం, తేళ్లపల్లి ధనలక్ష్మి, పార్టీ నాయకులు జల్లిపల్లి సురేష్, పి.శ్రీనివాసరావు, 3వ డివిజన్ అధ్యక్షుడు గపూర్, 34వ డివిజన్ అధ్యక్షుడు తోటపల్లి సోమశేఖర్, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు పుచ్చకాయల గోవింద్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

కార్పొరేషన్ బడ్జెట్

రూ.12.34 కోట్ల మిగులు

ఏకగ్రీవంగా ఆమోదించిన కార్పొరేషన్ కౌన్సిల్



సమావేశానికి హాజరైన ఎంపీ మాగుంట, కార్పొరేటర్లు, అధికారులు

- వచ్చే ఆర్థిక సంవత్సరానికి రాబడులు, ఆదాయం రూ.209.23 కోట్లుగా అంచనా
- ఖర్చుల కింద రూ.196.89 కోట్లుగా అంచనా
- నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన ఒకే రోజు సాధారణ, అత్యవసర, బడ్జెట్ సమావేశాలు
- కొన్ని అజెండాలపై సభ్యుల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై ధ్వజమెత్తిన సభ్యులు



మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. స్థానిక కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్ సమావేశాన్ని నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన నిర్వహించారు. తొలుత కౌన్సిల్ సాధారణ సమావేశం, తరువాత కౌన్సిల్ అత్యవసర సమావేశం అనంతరం బడ్జెట్ సమావేశాలు వరుసగా ఒకేరోజు నిర్వహించారు. నగరంలోని పలు అభివృద్ధి పనులపై లోతుగా కౌన్సిల్‌లో వాడి వేడిగా వైఎస్సార్‌సీపీ పాలక సభ్యులు, టీడీపీ ప్రతిపక్ష సభ్యుల మధ్య చర్చ సాగింది. అనంతరం నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో 2022–23 సవరించిన బడ్జెట్‌లో కలుపుకొని 2023–24 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను మేయర్ సభ ముందుంచారు. 2022–23 మిగులు బడ్జెట్ రూ.39.84 కోట్లు కలుపుకొని 2023–24 ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.209.23 అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. అందుకుగాను రానున్న ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల పద్దుల కింద రూ.196.89 కోట్లు ఖర్చులు అవుతున్నాయని అంచనా వేశారు. అలాగే రాబడులు, ఆదాయం కలుపుకొని, ఖర్చులు తీసివేయగా రూ.12.34 కోట్లు మిగులు బడ్జెట్‌గా అంచనా వేశారు. దీనిని కౌన్సిల్ ఆమోదించింది.

తొలుత నిర్వహించిన సాధారణ సమావేశంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన అమృత్ పథకం నగర పాలక సంస్థకు పెను భారంగా మారిందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుల చేతగానితనంతో ఆ పథకాన్ని అప్పట్లో పూర్తి చేయలేకపోయారని 19వ డివిజన్ కార్పొరేటర్ ఈదర సురేష్ బాబు (చిన్నారి) ధ్వజమెత్తారు. దీంతో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రభుత్వం నుంచి గ్రాంట్‌గా రూ.70 కోట్లు తెప్పించి పనులు చేపట్టాల్సి వచ్చిందన్నారు. అదే అప్పట్లో టీడీపీ ప్రభుత్వం పూర్తి చేసిఉంటే కార్పొరేషన్‌పై ఈ భారం పడేది కాదని, దీంతో మొదటి ఫేజ్ అమృత్ పథకం నగర ప్రజలకు ''విషం''గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఎస్ ట్యాంకు వద్ద ఉన్న బోర్ ద్వారా నవోదయ విద్యాలయం విద్యార్థినీ, విద్యార్థులకు మంచినీటి అందించాలని ఈదర సురేష్ బాబు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే 16వ డివిజన్‌లో కొంతభాగం ప్రజలకు మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా ప్రయోజనం లేదని ఆ డివిజన్ కార్పొరేటర్ శ్రీరాం నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలు నగర టౌన్ ప్లానింగ్ అధికారుల అసమర్థ పనితీరుపై సభ్యులు ధ్వజమెత్తారు. నగరంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ స్థలాల్లో సైతం నిర్మిస్తున్నారని స్వయంగా చెప్పినా అక్రమ నిర్మాణాలను ఆపకుండా నోటీసులు ఇచ్చామని తప్పించుకోవటం వెనుక మతలబు ఏమిటో అర్థం కావటం లేదని అసహనం వ్యక్తం చేశారు. జగనన్న హరిత వనాల్లో భాగంగా ప్రవేశపెట్టిన పనులు ప్రణాళికాబద్ధంగా జరగలేదని, ప్రకాశం భవన్ ముందు ఉన్న ప్రధాన రహదారిలో మొక్కలు పెట్టకుండా ముక్కలు, ముక్కలుగా చేసి పెట్టడం సరికాదని 14వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. శివారు ప్రాంత డివిజన్లను పూర్తిగా విస్మరిస్తున్నారని అటు పేర్నమిట్ట, ఇటు కొప్పోలు డివిజన్ల కార్పొరేటర్లు ఆరోపించారు. కార్పొరేటర్‌కు తెలియకుండానే డివిజన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కౌన్సిల్‌లో ఆమోదానికి పెట్టడం తగదని 24వ డివిజన్ సభ్యులు బేతంశెట్టి శైలజ మండిపడ్డారు. నగరంలోని పలు కాంప్లెక్స్‌ల నిర్మాణాల విషయంలో పీపీపీ విధానంలో చేపట్టాలనా లేక బీఓటీ పద్ధతిలో చేపట్టాలా అన్న పలు అంశాల్లో సభ్యులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. కొన్ని అంశాల్లో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాలను డిప్యూటీ మేయర్–2 వెలనాటి మాధవరావు సద్దుమణిగేలా చేశారు. ఓల్డ్ రిమ్స్, మిషన్ ఆస్పత్రి ప్రాంగణంలో పందుల పెంపకం చేపట్టి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారని, ఆ విషయాన్ని శానిటరీ సూపర్ వైజర్ పిచ్చయ్య దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని 21వ డివిజన్ కార్పొరేటర్ యనమల నాగరాజు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. సభ్యుల మధ్య ఏకాభిప్రాయానికి రాని అంశాలను మేయర్ గంగాడ సుజాత వాయిదా వేశారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంఈ కే.మాల్యాద్రి, ఏసీపీ కె.వెంకటేశ్వర్లు, శానిటరీ సూపర్ వైజర్ ఎస్.పిచ్చయ్య, ఆర్‌ఓ మధుసూదన రావుతో పాటు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అగ్రహారం రైల్వే బ్రిడ్జి త్వరలో పూర్తి చేస్తాం



నగరంలోని అగ్రహారం రైల్వే బ్రిడ్జిని వీలైనంత త్వరలో పూర్తి చేస్తామని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అన్నారు. కౌన్సిల్ సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యునిగా మొదటి సారిగా హాజరై ప్రసంగించారు. అగ్రహారం రైల్వే ఆర్‌యూబీకి రూ.11.17 కోట్లు గతి శక్తి ప్రోగ్రాం ద్వారా కేంద్రం మంజూరు చేసిందన్నారు. తొలుత ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న పరిపాలనా భవనం ప్లాను, స్థలాన్ని మేయర్ గంగాడ, కమిషనర్ వెంకటేశ్వరరావు చూపించారు. ఎంపీ నిధుల నుంచి కేటాయించాలని కోరారు. నాలుగంతస్తుల భవనం కాబట్టి నిర్మాణం పూర్తయ్యేసరికి ఆలస్యం అవుతుందని, ప్రత్యేకంగా మరేదైనా భవనం నిర్మించుకుంటే ఎంపీ నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

పొగాకు బ్యారన్ దగ్ధం

● రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కొండపి: మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. కొండపి అగ్నిమాపక కేంద్రం అధికారి ఆర్.మురళీకృష్ణ కథనం మేరకు.. కట్టావారిపాలెం గ్రామంలో పొగాకు రైతు రావెళ్ల వెంకటేశ్వర్లు బ్యారన్‌లో క్యూరింగ్ చేస్తున్నారు. ఆరుదశలో ఉండగా అల్లుడు కర్ర జారి పొగగొట్టం మీద పడింది. దీంతో బ్యారన్‌లో మంటలు చెలరేగి పొగాకు దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేసే సమయానికి పొగాకు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదం వల్ల రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు.

నేడు జిల్లా శాప్ లీగ్ షూటింగ్ బాల్ సెలక్షన్స్

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా శాప్ లీగ్ షూటింగ్ బాల్ సెలక్షన్స్ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు పీడీ టి.అశోక్ తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి పర్యవేక్షణలో సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 8919591417, 8919036160ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



తెరిచి ఉన్న బీరువా లాకర్

మార్కాపురం: పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ వెనుక ఓ ఇంట్లో ఆదివారం దొంగలు చోరీకి పాల్పడగా సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. భార్యాభర్తలైన ఉపాధ్యాయులు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా శ్రీశైలం వెళ్లారు. ఇంటి వెనుక వైపు తలుపు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు.. బీరువాలోని 5 తులాల బంగారు, వెండి ఆభరణాలు, రూ.30 వేల నగదు అపహరించారు. ఆదివారం రాత్రి ఇంటికి చేరుకున్న ఉపాధ్యాయులు బీరువా తెరిచి ఉండటాన్ని గమనించి నిర్ఘాంతపోయారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆధారాలు సేకరించి, దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలి

● డీఆర్‌ఓ ఓబులేసు



ఎమ్మెల్సీ ఎన్నికపై సమావేశం నిర్వహిస్తున్న డీఆర్‌ఓ ఓబులేసు

ఒంగోలు అర్బన్: ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్, టీచర్స్ నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని డీఆర్‌ఓ చిన ఓబులేసు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సోమవారం ప్రకాశం భవనంలో రాజకీయ పార్టీల నేతలు, అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికలు, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ జాబితా, ఇతర అంశాలపై చర్చించారు. అందరం సమన్వయంతో పని చేసి ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కృషి చేద్దామన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సరళావందనం, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఒంగోలు, కనిగిరి, చీరాల ఆర్డీఓలు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరభద్రాచారి(బీఎస్పీ), అజయ్ కుమార్(బీజేపీ), కాలేషాబేగ్(టీడీపీ), సీహెచ్ శ్రీనివాసరావు(సీపీఎం), పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

వృద్ధాప్యం.. విషాదాంతం.!

● అనారోగ్య కారణాలతో పురుగుమందు తాగి బలవన్మరణం



మృతుల వివరాలు తెలుసుకుంటున్న సీఐ రాజమోహన్‌రావు



కట్టా ముసలయ్య, వెంకాయమ్మ (ఫైల్)

అద్దంకి: అనారోగ్య కారణాలతో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని గొర్లమిట్టలో సోమవారం జరిగింది. స్థానికులు, బంధువులు అందించిన సమాచారం మేరకు పట్టణంలోని గొరకాయపాలెం (గొర్లమిట్ట)కు చెందిన కట్టా ముసలయ్య (79), వెంకాయమ్మ (70) ఇరువురు కుమారులు వివాహాలై వేరుగా ఉంటున్నారు. నాలుగు పోర్షన్ల సొంత ఇంటిలో వృద్ధ దంపతులు ఒక పోర్షన్‌లో నివశిస్తున్నారు. సమీపంలోని వేరే ఇళ్లలో కొడుకులు ఉంటున్నారు. ఈ క్రమంలో నాలుగు సంవత్సరాల క్రితం ముసలయ్య భార్య వెంకాయమ్మ కాళ్లు చేతులు చచ్చు పడటంతో మంచానికే పరిమితం అయింది. భార్యకు, తనకు సేవలు చేసేందుకు ఒక పనిమనిషిని నియమించుకున్నారు. ఆమె వారి పనులు చేసి పెడుతూ ఉంది. ఈ క్రమంలో నెల నుంచి ముసలయ్యకు కిడ్నీ సమస్య వచ్చి వంటికి నీరు చేరింది. ఇటీవల ఓ ప్రైవేటు వైద్యశాలలో వైద్యం కోసం వెళ్లి పరీక్షలు చేయించుకుని వచ్చాడు. ప్రతి రోజూ పనిమనిషి వచ్చి పని చేసి రాత్రికి ఇంటికి వెళుతుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇద్దరికి అన్నం పెట్టి పనిమనిషి ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు (సోమవారం) ఉదయం వచ్చి తలుపులు వేసి ఉండడంతో పిలిచింది. ఎంత పిలిచినా పలక్క పోవడంతో తలుపు తెరచి లోపలకు వెళ్లింది. లోపల ఇద్దరూ విగత జీవులై మంచాలపై పడి ఉండడంతో ఉలిక్కిపడిన పనిమనిషి వారి బంధువులకు తెలియజేసింది. సమాచారం పోలీసులకు తెలియడంతో ఎస్సై సమందర్‌వలి, సీఐ రాజమోహన్‌రావు సంఘటన జరిగిన ఇంటికి వెళ్లి విచారణ చేశారు. పురుగుల మందును టీ కప్పుల్లో పోసుకుని తాగినట్లు గమనించారు. అయితే నాలుగు సంవత్సరాల నుంచి భార్య అనారోగ్యంతో మంచానికే పరిమితం కావడం, ఇప్పుడు తానూ అనారోగ్యం పాలు కావడంతో ఇక బతికి ప్రయోజనం ఏముందని పురుగు మందు తాగి ఇరువురూ ఆత్మహత్య చేసుకుని ఉంటారని బంధువులు భావిస్తున్నారు. వృద్ధ దంపతుల ఆత్మహత్య పరిసర వాసులకు కంట నీరు తెప్పించింది.

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

● బాధితులకు ఎస్పీ మలికాగర్గ్ భరోసా



బాధితుల సమక్షంలో పోలీస్ అధికారులకు ఫోన్ చేసి సూచనలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లాలోని పోలీస్ అధికారులను ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 75 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదిదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అర్జీలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలంటూ ఫిర్యాదిదారుల సమక్షంలోనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆదేశాలిచ్చారు. స్పందన ఫిర్యాదులను పరిశీలిస్తే.. కేరళ రాష్ట్రంలో తమ బంధువులు పొక్లెయిన్ పనిచేస్తుండగా బంగారం దొరికిందని, దానిని తక్కువ ధరకే ఇస్తామంటూ మన రాష్ట్ర సరిహద్దు అయిన బి.కొత్తకోట సమీపంలో నలుగురు వ్యక్తులు తనతో పాటు తన వియ్యంకుని వద్ద నుంచి రూ.20 లక్షలు తీసుకుని నకిలీ బంగారం అంటగట్టారంటూ ముండ్లమూరు మండలం తిమ్మలూరు గ్రామానికి చెందిన రొంపిచర్ల సీతారామస్వామి ఫిర్యాదు చేశారు. అదే విధంగా అనంతవరం గ్రామానికి చెందిన కొల్లూరి రవీంద్రబాబు తనకు గ్యాంగ్‌మెన్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.1.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని, డబ్బు తిరిగివ్వాలని అడిగితే దాడి చేశాడని ఒంగోలు కబాడీపాలెంకు చెందిన వాటిపల్లి నాగూర్‌బాబు మొరపెట్టుకున్నాడు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తక్కువ ధరకు బంగారం ఇస్తామని చెబితే తొందరపడి కొనుగోలు చేయవద్దని, అధీకృత హాల్ మార్క్ ముద్ర ఉన్న బంగారాన్ని కొనడానికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నకిలీ బంగారం కేసుల్లో నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందన కార్యక్రమంలో అదనపు ఎస్పీ(క్రైమ్స్) శ్రీధరరావు, డీటీసీ డీఎస్పీ రామకృష్ణ, దిశ డీఎస్పీ పెల్లపురాజు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు కానిస్టేబుళ్లకు పదోన్నతి



పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లతో ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: ముగ్గురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పిస్తూ ఎస్పీ మలికాగర్గ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బి.రాజారావు(అర్ధవీడు), డి.రమణ(మార్కాపురం రూరల్), ఆర్.అంకయ్య(జె.పంగులూరు)కు పదోన్నతి పత్రాలను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతితో బాధ్యత పెరుగుతుందని, పోలీసు శాఖకు ప్రతిష్ట తీసుకువచ్చేలా విధులు నిర్వహించాలని సూచించారు.

చిన్నారి మృతికి టీకా కారణం కాదు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలో కొంగలవీడు రోడ్డు ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న నాయబ్ రసూల్, రుఖియా దంపతుల కుమార్తె అఫిఫాను గత శనివారం బాలసరస్వతి స్కూల్ ఆవరణలో వేసిన టీకా వల్ల మృతి చెందలేదని కె.ఎస్.పల్లె వైద్యాధికారి నాయబ్‌రసూల్ తెలిపారు. అఫిఫాతో పాటుగా అదే రోజు మరో ఆరుగురి చిన్నారులకు అదే డోస్ టీకా వేశామని చెప్పారు. చిన్నారికి వారి తల్లిదండ్రులు పాలు తాపిన తరువాత వెంటనే ఊయలలో వేయడం వల్ల చిన్నారికి పాలు గొంతులోనే ఉండిపోయి ఊపిరాడకుండా మృతి చెంది ఉంటుందే తప్ప టీకా వల్ల మృతి చెందే అవకాశం ఉండదని డా.నాయబ్‌రసూల్ నిర్ధారించారు. టీకా కారణం అయితే వెంటనే రియాక్షన్ ఉంటుందని, ఈ విధంగా జరగదని ఆయన తెలిపారు. తల్లిదండ్రుల అవగాహన లోపం కారణంగా పాప మృతి చెందిందే తప్ప టీకా వల్ల కాదని తెలిపారు.

కూలిన బతుకులు



మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ రాంబాబు, పోలీసులు

● వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు కూలీలు దుర్మరణం
● మరో ఐదుగురికి గాయాలు
● చీమకుర్తి బైపాస్, త్రిపురాంతకం మండలం దూపాడు వద్ద ప్రమాదాలు





సంఘటనా స్థలంలో మస్తాన్, అఖిల్ మృతదేహాలు

చీమకుర్తి: చీమకుర్తి బైపాస్‌లో మంగళవారం మధ్యాహ్నం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కర్రకోత కూలీలు దుర్మరణం చెందారు. కొత్తపట్నం మండలం ఈతముక్కల సమీపంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన వేటగిరి మస్తాన్(35), కత్తి అఖిల్(25) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సీఐ రాంబాబు, కర్రకోత యజమాని బొడ్డు వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మస్తాన్ తన బైకుపై జాలయ్యను, అఖిల్ తన బైకుపై సుబ్రహ్మణ్యంను ఎక్కించుకొని తూర్పు బైపాస్‌లో ఉన్న ఫిల్లింగ్ స్టేషన్‌లో పెట్రోల్ కొట్టించుకున్నారు. అనంతరం కూనంనేనివారిపాలెం మీదుగా ముప్పవారిపాలెం వెళ్లేందుకు పొదిలి వెళ్లే మార్గంలో ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో ఓ టిప్పర్ బైకులను తొలగేసి పోయే క్రమంలో.. టిప్పర్ తగులుతుందేమోనని అఖిల్ తన బైకుకు సడన్ బ్రేక్ వేసి ఎడమ వైపు రోడ్డు మార్జిన్ దిగాడు. బైకు అదుపు తప్పడంతో అఖిల్ తల రోడ్డుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న సుబ్రహ్మణ్యంకు స్వల్ప గాయాలయ్యాయి. ఆ వెనుకే వస్తున్న మస్తాన్.. అఖిల్ బైకును ఢీకొట్టి కింద పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ బైక్ వెనుక కూర్చున్న జాలయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని సీఐ రాంబాబు పరిశీలించారు. క్షతగాత్రుడు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రక్ నుంచి జారిపడి మహిళా కూలీ మృతి



బీబులమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

త్రిపురాంతకం: కూలీలు ప్రయాణిస్తున్న ట్రక్ డోర్ చైన్ తెగిపోవడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన త్రిపురాంతకం మండలంలోని దూపాడు సమీపంలో స్పీడ్ బ్రేకర్ల వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. యర్రగొండపాలేనికి చెందిన పలువురు కూలీలు త్రిపురాంతకం మండలంలోని నడిగడ్డ గ్రామంలో మిరపకాయలు కోసేందుకు వెళ్తున్నారు. వారు ప్రయాణిస్తున్న ట్రక్ దూపాడు సమీపంలోకి చేరుకోగానే డోర్‌కు ఉన్న చైన్ తెగిపోయింది. డోర్ మీద ఉన్న ముగ్గురిలో దూదేకుల బీబులమ్మ(48) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు కూలీలు స్వల్పంగా గాయపడ్డారు. సంఘటనా స్థలాన్ని సీఐ రాంబాబు, ఎస్సై సైదులు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త చిన్న గూడుసాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతర్ జిల్లా దొంగలు అరెస్టు

కంభం: గిద్దలూరు నియోజకవర్గంలోని వివిధ ఆలయాల్లో చోరీలకు పాల్పడిన అంతర్ జిల్లా దొంగలను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. కంభం పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ ఎం.రాజేష్, ఎస్సై నాగమల్లేశ్వరరావు వెల్లడించారు. ఈనెల 3వ తేదీ రాత్రి నర్సిరెడ్డిపల్లి గ్రామంలోని శివాలయంలో హుండీ పగలగొట్టి నగదు అపహరించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అంతర్ జిల్లా నేరస్తులైన మేడం అంజయ్య, బళ్లాని వెంకటరమణయ్య, బళ్లాని గురవయ్యను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నర్సిరెడ్డిపల్లిలో చోరీతోపాటు ఇటీవల కొమరోలు, గిద్దలూరు, బేస్తవారిపేట మండలం పెద్దఓబినేనిపల్లిలో చోరీలకు పాల్పడింది తామేనని విచారణ సమయంలో నిందితులు అంగీకరించారు. నిందితుల నుంచి రూ.40 వేలు స్వాధీనం చేసుకుని, గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ చెప్పారు.

1.40 కేజీల గంజాయి స్వాధీనం

● పామూరులో నలుగురు నిందితులు అరెస్టు

పామూరు: మండల కేంద్రమైన పామూరులోని విరాట్‌నగర్‌లోని ఓ నివాసంపై పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సోమవారం దాడి చేసి 1.40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు అనుమానిత మహిళ ఇంటిపై తహసీల్దార్ బీఆర్‌ఎల్‌వీ ప్రసాద్‌తో కలిసి దాడి చేసినట్లు ఎస్సై కె.సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. తనిఖీ సమయంలో పారిపోయేందుకు యత్నించిన పామూరుకు చెందిన శ్రీరామ వెంకటేశ్వర్లు, శ్రీరామ రమణయ్య, నల్లగట్ల చిన్నమ్మ, కనిగిరి దొరువుబజార్‌కు చెందిన దేవరకొండ వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుల నుంచి 1.40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సీఐ కాటూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులను కనిగిరి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని ఎస్సై వెల్లడించారు.

పెద్దబొమ్మలాపురంలో 125 గ్రాములు సీజ్

మార్కాపురం: మార్కాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలోని పెద్దదోర్నాల మండలం బొమ్మలాపురం చెంచుగూడెంలో గంజాయి సాగుచేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ రాగమయి సోమవారం తెలిపారు. గూడేనికి చెందిన కుడుముల పోతురాజు, భూమన అంకన్నలు పొలంలో 45 గంజాయి మొక్కలు సాగు చేసినట్లు గుర్తించామని, వాటిని ధ్వంసం చేశామని పేర్కొన్నారు. నిందితులిద్దరి నుంచి 125 గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడిలో ఎస్సై పద్మజ, సిబ్బంది జీవీ తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురం: నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాగమయి

గంజాయి సాగుపై ఉక్కుపాదం

● అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

యర్రగొండపాలెం: ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే జిల్లాలో గంజాయి సాగుపై ఉక్కుపాదం మోపుతున్నామని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం యర్రగొండపాలెం, పెద్దదోర్నాల మండలాల్లోని పలు గ్రామాలను సందర్శించిన ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన విస్తృత తనిఖీల్లో 12 కేసులు నమోదు చేసి 150 కిలోల గంజాయి, 94 గంజాయి మొక్కలు పట్టుకున్నామని, ఆయా కేసుల్లో 58 మందిని అరెస్ట్ చేసి, 7 వాహనాలను సీజ్ చేశామని వివరించారు. గంజాయి సాగుతోపాటు నాటు సారా తయారీ, అక్రమంగా మద్యం విక్రయాలపై నిఘా ఉంచినట్లు చెప్పారు. సెబ్, పోలీస్ శాఖల సిబ్బంది సంయుక్తంగా నిరంతరం దాడులు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. పత్తి, మిరప తోటల్లో గంజాయి మొక్కలు పెంచే రైతులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి మొక్కల పెంపకంపై సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. సమావేశంలో మార్కాపురం ఏఈఎస్(సెబ్) ఎ.శ్రీనివాసనాయుడు, సీఐ కె.మారుతీకృష్ణ, ఎస్సై జి.కోటయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంకటనారాయణరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్



దుగ్గెంపుడి వెంకటనారాయణరెడ్డి(ఫైల్)

పెద్దారవీడు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో ఓబులక్కపల్లె గ్రామం సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. హనుమాన్ జంక్షన్ కుంట నుంచి త్రిపురాంతకం వెళ్తున్న లారీ మార్గమధ్యంలో ఓబులక్కపల్లె సమీపంలో కర్నూలు–గుంటూరు జాతీయ రహదారి పక్కన ఓ హోటల్ వద్ద ఆగింది. ఓబులక్కపల్లె గ్రామానికి చెందిన దుగ్గెంపుడి వెంకటనారాయణరెడ్డి(52) బైక్‌పై హనుమాన్ జంక్షన్ నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య కోటిలింగమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అందరితో కలిసిమెలసి ఉండే నారాయణరెడ్డి మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి గ్రామంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వెంకటనారాయణరెడ్డి మృతి బాధాకరమని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విచారం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నారాయణరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దుగ్గెంపుడి వెంకటరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు ఉన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన గంగాధర్

గిద్దలూరు రూరల్: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని దిగువమెట్ట రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై బ్రహ్మనాయుడు కథనం ప్రకారం.. నంద్యాల జిల్లా గాజులపల్లెకు చెందిన గంగాధర్(48) అనే వ్యక్తి ఈ నెల 6వ తేదీన ఆర్టీసీ బస్సులో గిద్దలూరు వచ్చేందుకు టికెట్ తీసుకుని దిగువమెట్ట వద్ద దిగాడు. తాను నాలుగు రోజులపాటు ఇంటికి రాను అని కుటుంబ సభ్యులకు చెప్పి వచ్చాడు. తరుచూ కడుపు నొప్పితో బాధపడుతున్న గంగాధర్ మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందని ఎస్సై చెప్పారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహం వద్ద లభించిన బస్ టికెట్, ఆధార్ కార్డు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. మృతుడు హోటల్లో పనిచేస్తూ జీవిస్తుంటాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.